


అవగాహన ర్యాలీ

భట్టిప్రోలు : కోనేటిపురంలో సోమవారం తల్లిపాల విశిష్టత గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఫజురున్నీస్సా పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,009 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,260 క్యూసెక్కులు వదిలారు.



కలశాలతో విశేష పూజలు

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా సహస్ర కలశాభిషేకాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.

పచ్చ గూండాల రాజ్యం

- తొండెపిలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి
- మనస్థాపంతో చనిపోతున్నానంటూ లేఖ రాసి మాయమైన బాధితుడు
- క్రోసూరులో బైక్ దహనం చేసిన పచ్చ రౌడీలు
- గారపాడులో ఊరు వదిలి వెళ్లాలంటూ బెదిరింపులు

ఆగని టీడీపీ మూకల దౌర్జన్యాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు రూరల్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలో పచ్చినెత్తురు మరిగిన పచ్చ మూకల దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు దాటింది. ఇంకా ప్రతిచోటా దాడులు జరుగుతూనే ఉన్నాయి. వాహనాలు తగులబెట్టడం, కొట్టడం, ఊరిలో ఉండ వద్దంటూ బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా వట్టిచెరుకూరు మండలం గారపాడులో ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఉండటానికి వీలులేదంటూ టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఈ గ్రామంలో ఇరుపార్టీల మధ్య వివాదం రగులుతూనే ఉంది. ఇటీవల కొంత మంది వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించారు. వారికి బెయిల్ రావడంతో సోమవారం వారు విడుదలై గ్రామంలోకి వచ్చారు. వీరిని తెలుగుదేశం నేతలు అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు అసలు గ్రామంలో ఉండటానికి వీలు లేదని, ఊరు వదిలిపెట్టి వెళ్లాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు.

పోలీసులు చెప్పినా వినని టీడీపీ నేతలు

అడిషనల్ ఎస్పీ నిచికేత్ షలేకే, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ మహబూబ్‌బాషా గారపాడు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలతో చర్చిస్తున్నారు. తమ ఇంటికి తాము వస్తే రానీకుండా అడ్డుకోవడమేమిటని వైఎస్సార్ సీపీ నేతలు పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఇరువర్గాలతో చర్చించి గొడవలు ఆపకపోతే మళ్లీ రెండువర్గాలపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేతలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు ఎంత చెప్పినా టీడీపీ నేతలు వినలేదు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఉండడానికి వీల్లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తతత నెలకొంది. గ్రామంలో 20 మందితో పోలీస్ పికెట్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎట్టకేలకు ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పి ఇళ్లకు పంపారు.



గారపాడు గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు



పోలీసుల ఎదుటే వైఎస్సార్ సీపీ నేతలపై గొడవకు దిగుతున్న తెలుగుదేశం మూకలు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై పైశాచికం

పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండెపిలో ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన ముజాఫర్ సైదాపై ఆదివారం రాత్రి తెలుగుదేశం నాయకులు దాడి చేశారు. అతను గతంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాడంటూ టీడీపీ ప్రభుత్వం రాగానే ఒత్తిడి చేయడం మొదలు పెట్టారు. దీంతో సైదా తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అంతటితో ఆగని పచ్చమూకలు అసలు గ్రామంలో ఉండటానికే వీలు లేదని హెచ్చరించారు. దీంతో ముప్పాళ్లలోని అత్తగారి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం తన భార్యతో కలిసి వస్తుండగా పీసీబీ కాల్వ వద్ద తెలుగుదేశం నాయకులు అడ్డుకుని దాడి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన సైదా తన భార్యను ఇంటి వద్ద దింపి తాను చనిపోతున్నట్లు చెప్పి వెళ్లిపోయాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేయడంతో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు గాలిస్తున్నారు.

మరికొన్ని దౌర్జన్యాలు

- పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం ఎర్రబాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మడి ఏసుబాబు ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారు. గత ఎన్నికల సమయంలో జరిగిన గొడవ నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలోనే వాహనాన్ని వారే తగులబెట్టి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.
- దుర్గి మండలం అడిగొప్పలలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం గూండాలు దాడి చేశారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇప్పటికే వెయ్యి మందికిపైగా వైఎస్సార్ సీపీ నేతలు బయట ఊళ్లలో తలదాచుకుంటున్నారు. ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందితే పెద్ద కర్మకు వారిలో కొందరు రావడాన్ని సహించలేక ఎస్పీ వచ్చి వెళ్లిన కొద్దిసేపటికే దాదాపు 30 ఇళ్లపై టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి.

అర్జీలపై తక్షణ స్పందన

- స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 182 అర్జీలు

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 182 ఫిర్యాదులందాయి. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు. గత వారం వచ్చిన అర్జీలు మళ్ళీ రావడంతో అధికారులు వాటిపై స్పందించారు. గంగరాజు మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలు పదేపదే రీఓపెన్ చేసే అవకాశం ఉండదని పేర్కొన్నారు. అర్జీలు సంబంధిత కార్యాలయాలకు పంపగానే తక్షణం స్పందించి మండల స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను గంగరాజుతోపాటు జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, ఎల్‌డీఎం మహీపాల్ రెడ్డి, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి రఘు పరిశీలించారు.



అర్జీలను స్వీకరిస్తున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు

పేదల బతుకులపై ఉక్కుపాదం



గాంధీ పార్క్ ముందు వందల సంఖ్యలో పేదలు చిరు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నారు. ఇక్కడ బస్ బే నిర్మించాలని మమ్మల్ని ఖాళీ చేయిస్తున్నారు. పేదల ప్రభుత్వమని చెప్పి మమ్మలను ఇబ్బంది పెడితే ఎలా. తక్షణం చర్యలు చేపట్టండి.

– చిరువ్యాపారులు, గుంటూరు

ఇల్లు దగ్ధమైంది.. సాయం చేయండి

గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెంలోని సీతమ్మ కాలనీలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా నా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కూలి పనులు చేసుకుని జీవించే మాకు మళ్లీ నిర్మించుకునే శక్తిలేదు. ఆర్థిక చేయూత అందించి న్యాయం చేయాలని మనవి.

– కె.సామ్రాజ్యం, చల్లావారిపాలెం

ముంపు గ్రామాల్లో అప్రమత్తం

బెల్లంకొండ: నాగార్జున సాగర్ నుంచి దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేయడంతో పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. సోమవారం నుంచి ఒక్కసారిగా భారీగా వరదనీరు కృష్ణా నదికి వచ్చి చేరుతుంది. సాగర్ నుంచి 16 గేట్లు పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పులిచింతల ప్రాజెక్టు పరిధిలో నీటి నిల్వ గంట గంటకు పెరుగుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి నీరు అధికంగా వస్తుండడంతో మండలంలోని ముంపు గ్రామాల్లో వరదనీరు ప్రవహించనుంది. కాగా ఐదేళ్ల క్రితమే ముంపు గ్రామాలలో ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. గత కొనేళ్లుగా కొంతమంది రైతులు మెరక ప్రాంతాలలో ఉన్న పొలాలను సాగుచేసుకుంటున్నారు. గ్రామాలకు వరద ప్రవాహం పోటెత్తడంతో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారుల అప్రమత్తం అయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలైన పులిచింతల, గొల్లపేట, కోళ్లూరు గ్రామాల వద్ద నీటి మట్టం దాదాపుగా నది ఒడ్డులకు తాకుతోంది.



కేతవరం సమీపంలో నిండుకుండలా కృష్ణానది

న్యూస్‌రీల్

10 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



వినుకొండ(నూజెండ్ల): గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ సాఫ్ట్‌బాల్ స్టేట్ టోర్నమెంట్ గుడ్ షెపర్డ్ పాఠశాలలో ఈ నెల 10, 11,12 తేదీల్లో జరగనున్నాయని పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు క్రీడా మైదానాన్ని అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. పోటీల నిర్వహణపై చర్చించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పురుషులు, మహిళ జట్లు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నరసింహారెడ్డి, చిరంజీవి, సురేష్, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

29, 31 తేదీల్లో ఐటీఐ మూడో విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 29, 31 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో తక్కువ సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలో 577 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఐటీఐలో చేరదలచిన వారు ఈనెల 26లోపు తమ పేర్లు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని వివరించారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో తమ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 29న, ప్రైవేట్ కళాశాలల్లో ఈనెల 31న ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని వెల్లడించారు. వివరాలకు సెల్ నంబర్: 9347795839, 6304572793లలో సంప్రదించాలని సూచించారు.

30,579 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 30,579 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,626 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,500 నుంచి రూ.13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,051 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అండర్-7 జాతీయ చెస్ పోటీలకు చిన్నారి కావ్య



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన చిన్నారి ఏఎన్ఎస్ఎస్ కావ్య వచ్చే నెల 1 నుంచి 5 వరకు కర్ణాటకలోని మైసూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ చెస్ పోటీలకు ఎంపికైనట్టు శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో విజయనగరంలో జరిగిన అండర్-7 బాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో కావ్య ప్రథమ స్థానం సాధించినట్టు వెల్లడించారు. ఫలితంగా కావ్య జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ కావ్య అద్భుత ప్రతిభ కనబరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ కోచింగ్ సెంటర్లోనే కావ్య నిరంతర సాధన చేస్తున్నట్టు గోపీనాథ్ వివరించారు.

ఉద్యానానికి ఉపాధి ఊతం

ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలకు ప్రోత్సాహం

- జిల్లాలో జాబ్‌కార్డు కలిగిన రైతులకు సదవకాశం
- ఎకరాకు సుమారుగా రూ.1.10లక్షలు నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్న కేంద్రం
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5600 ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఇప్పటివరకు 1000 ఎకరాల్లో సాగు
- రైతుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు
- దరఖాస్తుకు అవకాశం

గురజాల: గ్రామీణులకు ఉపాధి కల్పించడం ద్వారా వలసలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సత్ఫలితాలను ఇస్తుంది. ఈ పథకం కింద చెరువులు, కాలువలు వంటి అభివృద్ధి పనులతో గ్రామాల్లో కూలీలకు సొంత ఊరిలోనే ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం ఉపాధి హామీ కింద రైతులకు చేయూతనిస్తున్నారు. ఉద్యాన పంటలైన పండ్లు, పూల తోటలు సాగు చేసే రైతులకు సాయం అందిస్తున్నారు. తద్వారా ఉద్యాన పంటల సాగును పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఉపాధి కింద పండ్ల తోటల పెంపకానికి మూడేళ్లు, పూల తోటల పెంపకానికి రెండేళ్లు పాటు నిర్వహణ ఖర్చులను రైతులకు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పల్నాడు జిల్లాలో పలువురు రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.

దరఖాస్తు ఇలా..

పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ,సత్తెనపల్లి,పెదకూరపాడు మండలాల్లో 2024-2025 సంవత్సరం 5600 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు సుమారుగా 1000 ఎకరాల్లో రైతులు పండ్లు, పూల మొక్కలు వేసేందుకు ఆసక్తి చూపినట్లు ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి కలిగిన రైతులు మండల కేంద్రాల్లోని డ్వామా ఏపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉపాధి పథకం కింద ఉద్యాన పంటల సాగుకు సాయం పొందేందుకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగియున్న సన్న, చిన్న కారు రైతులు మాత్రమే అర్హులు. 5 ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండాలి. రైతులు విధిగా పట్టాదారు పాసు పుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు పత్రాలతో పాటు మూడు పాస్ పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి.



జామ తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

సన్న, చిన్నకారు రైతులకు వరం

ఈ పథకం సన్న చిన్న కారు రైతులకు ఒక వరం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 12 రకాల పండ్ల తోటలకు సబ్సిడీతో పాటు మునగ తోటకు కూడా ఇవ్వడం జరుగుతుంది. పూల మొక్కలు గులాబీ, చామంతి, మల్లె తోటలకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని సన్న, చిన్న కారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం వర్తింపచేయాలంటే తప్పనిసరిగా ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగివుండాలి.

– జోసఫ్ కుమార్, డ్వామా పీడీ

12 రకాల పండ్ల తోటలకు అవకాశం..

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలకు ఉత్సాహం కలిగిన వారికి 12 రకాల పండ్ల మొక్కల పెంపకం చేపట్టడం జరుగుతుంది. మామిడి ఎకరాకు 70 మొక్కలు, జీడి మామిడి 70, బత్తాయి 100, నిమ్మ 110, జామ 110, తైవాన్ జామ 440, నారింజ 100, సపోటా 60, సీతాఫలం 50, అల్లనేరేడు 60, చింత 40, కొబ్బరి 60 మొక్కలు అందజేస్తారు. అలాగే పూల తోటలకు సంబంధించి గులాబీ 2 వేలు, మల్లె 1600 మొక్కలు అందిస్తారు. మొక్క ధర గుంత తీయడానికి రూ.96 కాగా, మొక్క నాటడానికి రూ.17 వంతున ఇలా.. ఏడాదికి ఎకరాకు సుమారుగా రూ.1.10లక్షలు చొప్పున పండ్ల తోటల నిర్వహణకు చెల్లిస్తారు. ఈ విధంగా రైతులకు మూడు సంవత్సరాల పాటు చెల్లించడం జరుగుతుంది. పూలమొక్కలకు రెండేళ్ల మాత్రమే ఇస్తారు.

పల్నాడు భాగ్యం ఎప్పటికో..!

పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్‌లేక ప్రయాణికుల ఇక్కట్లు

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఈ ప్రాంతవాసులు
- ప్రతిరోజూ హైదరాబాద్‌కు వందలాది మంది ప్రయాణం
- కరోనా తరువాత రేపల్లె ప్యాసింజర్ సైతం ఆగని పరిస్థితి
- ప్రజాప్రతినిధులు విన్నవించినా పట్టించుకోని రైల్వే అధికారులు
- పల్నాడుకు హాల్ట్ కల్పించాలని సంతకాల సేకరణ

పెదకూరపాడు: పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని ఈ ప్రాంత వాసులు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నారు. వచ్చిన ప్రతి రైల్వే అధికారికి, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నారు. కానీ వారి కల మాత్రం కలగానే మిగిలిపోతోంది. రేపల్లె - సికింద్రాబాద్ ప్యాసింజర్‌ను సైతం కరోనా తరువాత పెదకూరపాడులో నిలపకపోవడంపై ఈ ప్రాంతవాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

నిత్యం వ్యయప్రయాసలే..

పెదకూరపాడు రైల్వేస్టేషన్ రాజధాని అమరావతికి కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. పెదకూరపాడు, అమరావతి ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వందలాది మంది అనేక పనులపై, ఉద్యోగాలపై, బంధువులను చూసేందుకు హైదరాబాద్ వెళ్లి వస్తుంటారు. స్థానిక స్టేషన్‌లో రైళ్లు నిలపకపోవడంపై హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఉదయం 5:30 నిమిషాలకు అమరావతి నుంచి ఒక ఆర్టీసీ బస్సు సత్తెనపల్లికి వెళ్తుంది. సత్తెనపల్లిలో పల్నాడు ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయానికి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఈ బస్సులో నిత్యం వందమందికి పైగా ప్రయాణిస్తుంటారు. మరో వందకు పైగా ద్విచక్ర వాహనాల్లో తెల్లవారుజామునే బయలుదేరి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను అందుకునేందుకు ఎంతో వ్యయప్రయాసలతో సత్తెనపల్లి వెళుతుంటారు. అదే పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఉంటే ఇంత శ్రమ ఉండేదికాదు.





పెదకూరపాడు రైల్వేస్టేషన్

రేపల్లె–సికింద్రాబాద్ ప్యాసింజర్ సైతం..

కోవిడ్‌కు ముందు పెదకూరపాడులో ఉదయం 10 గంటలకు రేపల్లె–సికింద్రాబాద్ ప్యాసింజర్‌కు హాల్ట్ ఉండేది. కరోనా తరువాత దీన్ని ఫాస్ట్ ప్యాసింజర్‌గా మార్చి ఈ స్టేషన్‌లో ఆపడం లేదు. కోవిడ్‌కు ముందు 2019 మార్చి నుంచి 2020 ఫిబ్రవరి వరకు పెదకూరపాడు రైల్వేస్టేషన్ నుంచి 71,300 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. దీంతో ప్యాసింజర్ కూడ లేకపోవడంతో ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఎంపీ వినతిని కూడా పట్టించుకోని రైల్వే అధికారులు

గత నెల పెదకూరపాడు ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు నర్సరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు ఢిల్లీలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె - సికింద్రాబాద్ ప్యాసింజర్ విషయమై వినతిపత్రం అందించారు. ఈ విషయంలో కనీస స్పందన లేదు. దీంతో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని సంతకాల సేకరణ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

పల్నాడు ఆగితే ప్రయాణం సులభం...



రాజధాని ప్రాంతమైన పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్ హాల్ట్ అనేది ఈ ప్రాంతవాసుల ఆకాంక్ష. ఏళ్ల తరబడి వినతులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా రైల్వే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇక్కడ పల్నాడు ఎక్స్‌ప్రెస్ ఆగితే ప్రయాణం సులభతరమవుతుంది. పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించేందాక సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతాం..

–కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతి శ్రీ, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు

అనేక వినతులు ఇచ్చాం..



పల్నాడు ఎక్స్‌ప్రెస్ పెదకూరపాడులో ఆపాలని రైల్వే, ప్రజాప్రతినిధులకు అనేక వినతులు ఇచ్చాం. హాల్ట్ ఇచ్చేవరకు పోరాడుతాం. రాజధాని ప్రాంతానికి దగ్గరగా ఉన్న పెదకూరపాడులో ఎక్స్‌ప్రెస్ హాల్ట్ ఉంటే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులకు ప్రయోజనం.

–మునగోటి శ్రీనివాసరావు, సీపీఐ కార్యదర్శి, పెదకూరపాడు

అందుబాటులో వరి విత్తనాలు

- జేజీఎల్-384రకం లభ్యత తక్కువగా ఉండటంతో కొరత
- అందుబాటులో నాణ్యత, అధిక దిగుబడినిచ్చే రకాలు
- డీఏఓ ఐ.మురళి

నరసరావుపేటరూరల్: జిల్లాలో సాగుకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. నాగార్జున సాగర్‌లో నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉండటంతో ఈ ఏడాది జిల్లాలో వరిసాగు సాధారణానికి మించి జరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. 2024 ఖరీఫ్‌లో పంట సాధారణ విస్తీర్ణం 42.095 హెక్టార్లు కాగా 50 వేల హెక్టార్లు వరకు సాగుచేసే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు గాను 31వేల క్వింటాళ్లు వరి విత్తనాలు అవసరం ఉందని వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించి ఏపీ సీడ్స్, ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరా చేసేందుకు అందుబాటులో ఉంచినట్టు వివరించారు. బావులు, బోర్లు, చెరువులు వంటి నీటి సదుపాయం ఉన్నచోట బీపీటీ-5204 రకం దీర్ఘకాలిక రకాన్ని సాగుచేయాలని సూచించారు. రైతులు మధ్యస్థ, స్వల్పకాలిక రకాల వరిని సాగుచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు.



డీఏఓ ఐ.మురళి

- మధ్యస్థ, స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ-1224, ఎంటీయూ-1282, ఎంటీయూ-1210, ఎంటీయూ-1121, ఎన్ఎల్ఆర్-3354, ఎన్ఎల్ఆర్-3238, ఎన్ఎల్ఆర్-3449, జేజీఎల్-383, జేజీఎల్-27356, కేఎన్ఎం-733, కేఎన్ఎం-1638 వంటి రకాలు జిల్లాలో సాగుకు అనుకూలమైనవని తెలిపారు.
- రైతులు ఎక్కువగా మొగ్గుచూపే ప్రైవేటు సన్న రకాలైన అంకుర్ సోనా, అంకుర్ పద్మ, ఏపీ-567, అన్నపూర్ణ వంటివాటిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ రకాల విత్తనాలు నాణ్యత కలిగి, మార్కెట్‌లో లాభదాయకరమైన ధరలతో రైతులకు నికర ఆదాయాన్ని అందిస్తాయన్నారు.
- ఎంటీయూ-1224(1500 క్వింటాళ్లు), ఎంటీయూ-1121(1000 క్వింటాళ్లు), ఎన్ఎల్ఆర్-3449 (2వేల క్వింటాళ్లు), కేఎన్ఎం-1638(6వేల క్వింటాళ్లు) రకాల విత్తనాలు మొత్తం 10,500 క్వింటాళ్లను ఏపీ సీడ్స్ ద్వారా సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడి వాహనం దహనం

ఎర్రబాలెం(క్రోసూరు): పల్నాడు జిల్లా క్రోసూరు అనుబంధ గ్రామమైన ఎర్రబాలెం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మడి ఏసుబాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఏసుబాబు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి ముందు తన గ్లామర్ ద్విచక్రవాహనం పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. సోమవారం ఉదయం విషయం వెలుగుచూసింది. దీనిపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

గురజాల ఎమ్మెల్యే యరపతినేనికి సీఐటీయూ వినతి

పిడుగురాళ్ల: చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం లేకుండా దౌర్జన్యంగా తొలగించటం అన్యాయమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించటం పద్ధతి కాదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ హజ్ర, శాంతమణి, వెంకట రావమ్మ, శివరంజని ఉన్నారు.

ఇసుక రేవుల వద్ద పనిచేయలేం

‘కొద్ది రోజులుగా తుళ్లూరు మండలం లింగాయపాలెం, తాళ్లాయపాలెం వద్ద ఇసుక రేవుల్లో విధులు నిర్వహిస్తున్నాం. కనీసం కూర్చునేందుకు కుర్చీల్లేవు. మద్యం మత్తులో ఉండే కొందరు లారీ డ్రైవర్ల మధ్య పనిచేస్తున్నాం. స్థానిక అధికారులు కనికరించడంలేదు. ఆదివారం కూడా డ్యూటీ చేయిస్తున్నారు. ఈ విధులతో పాటు సచివాలయంలో ఎవరూ లేకపోయినా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో సహోద్యోగులు తమకు పనుల్లేవని, ప్రతీది మీరే చేయాలంటూ చులకనగా మాట్లాడుతున్నారు. ఇసుక రేవుల్లో విధుల నుంచి మినహాయించాలని’ తుళ్లూరు మండల మహిళా పోలీసులు పి.మాధవి, బి.శిరీషరాణి, ప్రసన్న వేడుకున్నారు..

- మహిళా పోలీసులు వినతి
- ఇల్లు ఖాళీ చేయమని అడిగితే బెదిరిస్తున్నారు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), ఎం.వెంకటేశ్వరరావు (సెబ్) బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల బాధలను జిల్లా ఏఎస్పీలు ఆలకించారు. డీఎస్పీలు శివాజీరాజు(సీసీఎస్), సుబ్బారావు(దిశ) అర్జీలు స్వీకరించారు.



బాధితుడితో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి

కుమార్తె పెళ్లి కోసమని..

గతేడాదిలో కుమార్తె పెళ్లి అని డ్రైవర్ డబ్బులు అప్పు అడిగాడు. ఫోన్ పే ద్వారా విడతలు వారీగా రూ.4.60 లక్షలు చెల్లించా. బ్యాంక్ రుణం వస్తుందని, వచ్చాక తిరిగి చెల్లిస్తానని నమ్మబలికాడు. ఈ ఏడాది జనవరిలో బ్యాంక్ రుణం రాగా, ఆరేడు నెలలు గడిచిన డబ్బులు చెల్లించలేదు. ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు. ఈ విషయమై డ్రైవర్, అతడి కుటుంబ సభ్యులను అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. వారి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించి, న్యాయం చేయగలరు.

– పోతురాజు వెంకట శ్రీనివాసరావు, రిటైర్డ్ ఇంజినీర్, ఎస్‌వీఎస్‌కాలనీ

ఇల్లు ఖాళీ చేయడంలేదు..



తెనాలి చెంచుపేటలో సోదరుని వద్ద 2012లో రూ.65 లక్షలకు ఇల్లు కొనుగోలు చేశాం. అప్పటి నుంచి అతడే ఇంట్లో అద్దెకు ఉంటూ అద్దె చెల్లిస్తున్నాడు. భార్యాభర్తలు ఇద్దరం సింగపూర్‌లో 21 ఏళ్లు ఉన్నాం. 2020 ఫిబ్రవరిలో తాను అక్కడ్నుంచి స్వగ్రామం రాగా, ఈలోగా కోవిడ్-19 దృష్ట్యా ఇక్కడే ఉన్నా. 2021 ఫిబ్రవరిలో భర్త కూడా వచ్చేశారు. ఈ క్రమంలో రెండుసార్లు గుండె శస్త్రచికిత్స చేయించుకున్నా. ఇద్దరికి ఉద్యోగాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నాం. సోదరుడు ఓ ప్రభుత్వాస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా, అతడి భార్య హెడ్ నర్సుగా చేస్తోంది. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇల్లు ఖాళీ చేయమంటే రూ.15 లక్షలు చెల్లిస్తే బయటకు వెళ్తామని అంటున్నారు. చంపుతామని, పిల్లలపై యాసిడ్ పోస్తామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– మామిడి విజయకుమారి, సుదర్శన్ దంపతులు, చెంచుపేట, తెనాలి

కానిస్టేబుల్ నగదు చెల్లించడంలేదు..

ఇల్లు కొనుగోలు నిమిత్తం నరసరావుపేటకు చెందిన ఓ కానిస్టేబుల్‌కు కొద్ది నెలలు క్రితం రూ.3.50 లక్షల డబ్బులిచ్చాను. పది రోజుల్లో ఇస్తానని ఇప్పటి వరకు చెల్లించలేదు. నాలుగేళ్లు గడిచిన చెల్లించడంలేదు. గతంలో ఎస్‌బీ సీఐ దృష్టికి తీసుకెళ్లగా, ఈ ఏడాది జూన్ ఐదున చెల్లిస్తానని కాగితం రాసిచ్చాడు. ఇప్పటికి డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. న్యాయం చేయగలరు.

– గంటి నాగమణి, గుజ్జనగుండ్ల

పది గ్రాములు తక్కువ..

గతంలో అరండల్‌పేటలోని ఓ మనీ గోల్డ్‌లో 208.1 గ్రాముల బంగారు వస్తువులు తనఖా పెట్టి, రూ.8 లక్షలు తీసుకున్నా. మిగతా 131 గ్రాముల బంగారం ఒకే రోజు ఒకే వ్యక్తి పేరుపై తనఖా వద్దని నిర్వాహకులు ఒప్పించి వారు సూచించిన వ్యక్తి పేరుపై మిగతా 131 గ్రాముల బంగారం తనఖా పెట్టించారు. నా పేరుపై ఉన్న బంగారం వస్తువులను గతనెలలో డబ్బులు చెల్లించి తీసుకున్నా. అందులో పది గ్రాముల బంగారం తగ్గిందని అడిగితే సరైన సమాధానం లేదు. వేరే వ్యక్తిపై తనఖాలో ఉన్న బంగారం విషయమై అడిగితే సమాధానం లేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అదేమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

-జి.ప్రసన్న, చేబ్రోలు మండలం

హత్యాయత్నం చేసినా పట్టించుకోవడం లేదు..

పోలీసుల తీరుపై బాధితుడి ఆవేదన



గాయపడి ఇంట్లో మంచానికి పరిమితమైన షేక్ హుస్సేన్‌షా

గుంటూరు ఈస్ట్: టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేసినా పోలీసులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేశారని, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని బాధితుడు షేక్ హుస్సేన్‌షా సోమవారం ఆరోపించాడు. ఆయన అందించిన వివరాలు.. శారదాకాలనీ 19వ లైనులో చిన్న గొడవ అడ్డుపెట్టుకుని స్థానిక టీడీపీ కార్యకర్తలు జూన్ 23వ తేదీ రాత్రి కత్తులు, ఇనుప రాడ్‌లతో దాడి చేసి గాయపరిచినట్లు చెప్పారు. స్థానిక నాయకులు జాకీర్ హుస్సేన్, మహబూబ్, మరికొంత మంది టీడీపీ పెద్దల సహాయంతో పొన్నూరు నుంచి దాదా హుస్సేన్, అతని తమ్ముడు ఖాసిం, మరో 40 మందిని పిలిపించి, సుమారు 150 మంది తనపై, తన బంధువులపై కత్తులు, రాడ్‌లు, కారంతో మూకుమ్మడిగా దాడిచేశారని ఆరోపించారు. దాడిలో సుమారు 30 మందికిపైగా తీవ్రంగా గాయపడగా నేను, మరికొంత మంది ఇప్పటికీ కోలుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అరండల్‌పేట పోలీసులు 324, 509 సెక్షన్‌ల కేసులు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులపై హత్యాయత్నం కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గాయపడిన తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు.

దాడి బాధితుడికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



ధర్నాసి రవికుమార్‌కు చెక్కు అందిస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తదితరులు

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ సీపీకి చెందిన వారిపై పలుచోట్ల టీడీపీ వారు దాడులకు తెగబడుతున్నారు. ఈ దాడుల్లో నష్టపోయిన వారికి వైఎస్సార్ సీపీ అధిష్టానం అండగా నిలుస్తోంది. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ధర్నాసి రవి కుమార్‌పై ఎన్నికల కౌంటింగ్ అనంతరం యడ్లపాడు గ్రామంలో టీడీపీకి చెందిన కొందరు దాడి చేశారు. గాయపడిన రవికుమార్‌కు మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన సదరు చెక్కును గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో యడ్లపాడు మండలం పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, వైఎస్సార్ సీపీ మైదవోలు గ్రామ సీనియర్ నాయకులు గౌరు రాజేష్ పాల్గొన్నారు.

సాగర్ కుడి కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో గోపాలరావు మాట్లాడుతూ.. రెండు, మూడు ఏళ్లుగా సాగునీరు లేక కుడికాలువ ఆయకట్టు మాగాణి భూమి సాగుకు నోచుకోలేదని చెప్పారు. కుడికాలువకు 132 టీఎంసీల నికర జలాల అనుమతి ఉన్నా ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. ఈ నెల ఒకటో తేదీనాడు సాగర్ ఎడమ కాలువకు తెలంగాణ నీరు విడుదల చేసినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం స్పందించలేదని విమర్శించారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చేకూరి సురేష్ రాజా పాల్గొన్నారు

స్కీం వర్కర్లపై వేధింపులు తగదు

స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జోలికి వస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కూటమి ప్రభుత్వ రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆర్‌పీలు, యానిమేటర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు సాయికుమారి, సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంత రెడ్డి, నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లాబక్షు, రాజకీయ వేధింపులకు గురైన స్కీం వర్కర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

శావల్యాపురం మండలం కారుమంచి, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామాల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసే పైప్‌లైన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరికి 2013 భూ సేకరణ చట్టప్రకారం పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ గ్రామాల రైతులు కలెక్టర్‌కి గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు. రైతు సంఘం జిల్లా నాయకులు చేకూరి సురేష్ రాజా, కామినేని రామారావు, మన్నం వెంకటేశ్వర్లు, ఎర్ర బిక్కి ఆంజనేయులు, ముప్పాగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అభ్యంతరకరం



వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు

ఏఎన్‌యూ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అభ్యంతరకరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య(ఎన్‌డీఎస్‌ఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు రత్నసాగర్, గణేష్ పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను గురించి చర్చించేందుకు ఎన్‌డీఎస్‌ఎఫ్ విద్యార్థి, పరిశోధక, అతిథి అధ్యాపకులు సోమవారం యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీలను ఉప కులాలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలను అందించడం వలన సరైన ప్రాతినిధ్యం పొందని వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని 341, 342 అధికరణలను అనుసరించి తీర్పు ఇవ్వాల్సిన న్యాయస్థానం వాటిని పరిగణలోకి తీసుకోకుండా, తీర్పుని ఇవ్వటం కచ్చితంగా రాజ్యాంగానికి విఘాతమేనన్నారు. ప్రస్తుతం అధికార ప్రభుత్వాలు ఈ విషయంలో ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ అస్పష్ట తీర్పు వారి రాష్ట్రంలో అమలు చేయకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌డీఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు రత్న కిషోర్, పరిశోధకులు హర్షవర్ధన్, పవనమూర్తి, శ్రావణ్ పాల్గొన్నారు.

జ్వరపీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే

డెప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణ



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడిలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తిస్తున్నామని డెప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సోమవారం సందర్శించారు. వైద్యులు అబ్దుల్ రహమాన్, గ్రామ సర్పంచి అజీజున్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఫాగింగ్ నిర్వహిస్తున్నామని, నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేయించామని సర్పంచి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వైద్యశిబిరంలో కొత్తగా ఐదు జ్వరం కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. గతంలో జ్వరంతో బాధపడుతున్న వారు కోలుకున్నారని, వైద్య సిబ్బంది 15 బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించడం, పారిశుధ్యంపై అవగాహన కల్పించడం చేస్తున్నామని వైద్యులు డాక్టర్ అబ్దుల్ రహమాన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సి.ఇందిర, సబ్ యూనిట్ అధికారి వి.పున్నారెడ్డి, సీహెచ్‌ఓ జనమ్మ, హెచ్‌ఈ సుబ్బారావు, హెచ్‌ఎస్ ఖాజా పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ



మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

నరసరావుపేట రూరల్: నాణ్యమైన విత్తనాలను సరైన సమయంలో సరైన ధరకు రైతులకు అందించడమే విత్తనోత్పత్తి పథకం లక్ష్యం అని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెంలో రైతు సేవా కేంద్రంలో సోమవారం గ్రామ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో నరేంద్ర బాబులు పాల్గొన్నారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తే వారు 15 శాతం అధిక దిగుబడులు పొందొచ్చని తెలిపారు. ప్రస్తుతం డివిజన్‌లో సాగు చేసేందుకు అనుకూలంగా ఉన్న విత్తన రకాలను ఏడీఏ మస్తానమ్మ వివరించారు. నాగార్జునసాగర్‌లో నీటి విడుదలపై నెలకొన్న సందిగ్ధత వల్ల రైతులు స్వల్పకాలిక విభాగంలోని జేజీఎల్-383 రకంపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ రకానికి ప్రత్యామ్నాయంగా జేజీఎల్-27356, ఎంటీయూ-1224, ఎంటీయూ-1282, బీటీపీ-5204 రకం వంగడాలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో ప్రవీణ్, గ్రామ టీడీపీ నాయకులు కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో విజయనగరం జిల్లా జట్టు



ఆర్.సుమంత్‌వర్మ (5 వికెట్లు)



ఆర్.దామోదర్ (5 వికెట్లు)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం అనంతపురం, విజయనగరం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమయింది. టాస్ గెలిచిన అనంతపురం జిల్లా జట్టు బ్యాటింగ్ ఎంచుకొని తొలి ఇన్నింగ్స్‌లో 141 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎ.జయంత్‌కృష్ణ 32 పరుగులు సాధించాడు. విజయనగరం బౌలర్ ఆర్.సుమంత్ వర్మ 7.1 ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఆర్.దామోదర్ కూడా 12.1 ఓవర్లలో 62 పరుగులు ఇచ్చి 5 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు నష్టపోయి 164 పరుగులు సాధించింది. జట్టులోని బి.మధుసూదన్ 61 పరుగులతో క్రీజ్‌లో ఉండగా, కె.ఋత్విక్‌సంపత్ 51 పరుగులతో రాణించాడు. విజయనగరం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటికే 23 పరుగుల ఆధిక్యం లభించింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తాడికొండ: కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కె.సామ్రాజ్యం(55) అనారోగ్యం గురికాగా ద్విచక్ర వాహనంపై కుమారుడు సాంబశివరావు, కోడలు స్వాతితో కలిసి ఆస్పత్రికి తీసుకెళుతుండగా లాం చలపతి కళాశాల వద్దకు వెళ్లే సరికి వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. కిందపడిన సామ్రాజ్యం ఘటనా స్థలంలోనే మరణించగా కోడలు, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5000, గరిష్ఠ ధర రూ.6200, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

ఆలయ రికార్డులను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

తెనాలి: పట్టణ చెంచుపేటలోని ఉడా కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణ కమిటీ దగ్గరున్న పూర్తి రికార్డులను సమర్పించాలని ఆలయ నిర్మాణ కమిటీని హైకోర్టు ఆదేశించింది. కమిటీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్, దేవదాయశాఖ కమిషనర్, ప్రభుత్వానికి, ఉడా కాలనీ సంక్షేమ సంఘానికి ఉత్తర్వులను పంపింది. స్థానిక బాలాజీరావుపేటకు చెందిన గుండేపల్లి శ్రీనివాసరావు దాఖలు చేసిన రిట్ పిటిషనుపై హైకోర్టు ఈ ప్రకారం ఆదేశాలు జారీచేసింది. అయితే పిటిషనుదారు ఆలయంతో తనకేం సంబంధం లేదని తమ కమిటీకి లేఖ ఇచ్చారనీ, దీనిని మున్సిపాలిటీకి అందజేశామని కమిటీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. హైకోర్టుకి ఈ లేఖను అందజేయనున్నట్లు వివరించారు.

బెల్టు షాపులపై సెబ్ అధికారుల దాడులు

36 తెలంగాణ మద్యం సీసాల స్వాధీనం

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో కొంత కాలం నుంచి మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా నడుపుతున్నారు. రెండు నెలల నుంచి ఇళ్ల మధ్యే ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు తెలంగాణ మద్యం విక్రయిస్తున్నారు. స్థానికులు ఎన్నిసార్లు అభ్యంతరం తెలపినా బెల్టు షాపుల నిర్వాహకులు బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు సత్తెనపల్లి సెబ్ అధికారులు, సీఐ శ్రీనివాసరావు సోమవారం అనుపాలెంలోని సోదాలు చేశారు. రెండు బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా, నడుపుతున్నవారు పారిపోయినట్లు తెలిసింది. శిఖా వాసు ఇంట్లో 36 తెలంగాణ మద్యం సీసాలు దొరికినట్లు సమాచారం.

పోలీసులపైనే చిరు వ్యాపారుల వ్యాఖ్యలు

అధికార పార్టీ అండ చూసుకుని అత్యుత్సాహం

యడ్లపాడు: ‘‘ఇది మా ప్రభుత్వం... అంతా మా ఇష్టం.. అడగటానికి మీరెవరు.. మేం చెప్పింది మీరు వినాలి... అర్ధరాత్రి వరకు వ్యాపారం చేసుకుంటాం.. ఏందంటా’’ అంటూ కూటమి ప్రభుత్వానికి చెందిన వారు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలివి. పల్నాడు జిల్లా యడ్లపాడులో రాత్రి 11 గంటలకు చిరు వ్యాపారాలను నిలిపివేయాలని చెప్పేందుకు వెళ్లిన పోలీసులకు ఎదురైన చేదు అనుభవం ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీ రాత్రి ఎప్పటిలానే పోలీసులు గ్రామంలో గస్తీ నిర్వహణలో భాగంగా సర్వీసు మార్గాల వెంబడి ఉన్న చిరువ్యాపారాలు చేసుకునే వారిని లైట్లు ఆర్పాలని, దుకాణాల్ని మూసివేయాలని కోరారు. ఈ క్రమంలో సదరు దుకాణాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అవాక్కయ్యారు. ప్రజల ముందు డిపార్టుమెంట్‌ను హేళన చేశారు. ఇది తెలిసి అక్కడికి వెళ్లిన మరో అధికారితో అవమానకరంగా మాట్లాడటంపై పోలీసులు, చిరువ్యాపారుల మధ్య వాగ్వాదం నెలకొంది. తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలపై పోలీసులు సీరియస్‌గా ఉన్నారు. మర్నాడు ఒకరిపై కేసు సైతం నమోదు చేశారు.

ఇరు వర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

గురజాల: మండల పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు.. పాతకక్షల నేపథ్యంలో ఏర్పడిన వివాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వారిని తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ బాలకృష్ణలు వెళ్లి సమాచారం సేకరించి, కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని సీఐ బాలకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. లా అండ్ ఆర్డర్ సమస్యకు కారణమైన ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదన్నారు. ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.